దేశంలో 14 కోట్ల మంది ఓట్ల ను తొలగించి రాజ్యాంగ విలువలను ప్రజాస్వామ్య ని బొంద పెడుతున్న సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ ను డిస్మిస్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్ టియు)రాష్ట్ర కమిటీ సమావేశం సంఘం అధ్యక్షులు ఐ.కృష్ణ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న టి. శ్రీనివాస్,సాదినేని వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ 40 ఇండ్ల క్రితం బిఐఎఫ్ఆర్ లోకి వెళ్లిన సింగరేణిని కార్మికులు అపరిమితంగా శ్రమించి లాభాల బాటలోకి తెచ్చారని ఇందుకుగాను వందల కోట్ల లాభాల నుండి కార్మికులకులాభాలవాటా ను బోనస్ గా చెల్లిస్తున్నారని వారు అన్నారు. గత సంవత్సరం పర్మినెంట్ కార్మికులకు 34%,కాంట్రాక్టు కార్మికులకు 5500 బోనస్ ని ఇచ్చారని 2026 సంవత్సరంలో 40% పర్మినెంట్ కార్మికులకు,10 శాతం కాంట్రాక్టు కార్మికులకు బోనసు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయని రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు కార్మిక సంఘాల డిమాండ్ ను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోకుండా నేడు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గత సంవత్సరం బోనస్ ను ఏమాత్రం పెంచకుండా ప్రకటించడం విడ్డూర మైంద ని ఇది సింగరేణి కార్మికులనే కాకుండా సింగరేణి కోల్బెల్ట్ ప్రాంత ప్రజలందరినీ మోసం చేసినట్లు అవుతుందని వారు అన్నారు .ఈ ద్రోహానికి సింగరేణి ప్రాంతఎమ్మెల్యేలు మంత్రులు,పార్లమెంటు సభ్యులు కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందని వారు అన్నారు. దేశంలో 14కోట్ల మంది,తెలంగాణ రాష్ట్రంలో 93 లక్షల ఓట్లను తొలగించిన ఎస్ఐఆర్ బాగోతాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్న ప్పటికీ సిఇసి జ్ఞానేశ్వర్ రాజీనామా రాజీనామా చేయాల్సిన అవసరం ఉండగా



ఆయనను కాపాడుతున్న మోడీ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థి, యువజన,ప్రజా ఉద్యమాల పై మోడీ ప్రభుత్వం సాగిస్తున్న ఫాసిస్టు నిర్బంధాన్ని సాగిస్తున్నాను అని అన్నారు బిజెపి సంఘపరివారశక్తుల ఫాసిస్ట్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు ప్రకటించారు.ఎస్ఐఆర్ కి వ్యతిరేకంగా జరుగుతున్న విద్యార్థి,యువజన,ప్రజా ఉద్యమాలలో కార్మిక వర్గం పాల్గొనాలని,సిఇసిజ్ఞానేశ్వర్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాల తీవ్రతను గుర్తించి సీఈసీని బర్త్ రఫ్ చేయాలని మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.చనిపోయిన వారు మినహా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని టి.శ్రీనివాస్,సాదినేని డిమాండ్ చేశారు.సమావేశంలో ఆటో. మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, కాంట్రాక్టు. ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, షెడ్యూల్ ఎంప్లాయ్ మెంట్ కార్మికులకు నష్టం చేస్తున్న జీవో.6ఉపసంహరించుకోవాలని నెలకు 30 వేల కనీస వేతనం నిర్ణయించాలని డిమాండ్ తో ఆందోళనలు చేయాలని సమావేశం నిర్ణయించింది.రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జే. సీతారామయ్య,ఆర్.జనార్న్,భూమయ్య,శివబాబు, సూర్య శివాజీ,రాసు ద్దీన్, సారంగపాణి,నాగయ్య,ఏ. వెంకన్న,ఈ. నరేష్,ఈదునూరి రామకృష్ణ,ఏ.వెంకన్న,డి. బ్రహ్మానందం,చిలుకా శంకర్, ఐ.రాజేశం,టి. శ్రీనివాస్, హెచ్.లింగయ్య భూమేశ్వర్, రామన్న,ఐ.వెంకన్న, డి.ప్రసాద్,శివకుమార్, మేకల రామన్న,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి మండలం బంధాల గ్రామపంచాయతీ రోడ్డు పరిస్థితి



- **తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం**
- **టీపిజిఎస్ ములుగు జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి ఈసం కృష్ణమూర్తి**
- **మాబృందంతో పాటు పోచ్చపూర్ నుండి కోడిశాల రోడ్డును పరిశీలించడం జరిగింది.**

తాడ్వాయి డిడి9 వార్త



తాడ్వాయి మండలం బంధాల గ్రామపంచాయతీలో ఈరోడ్డు రెండున్నర సంవత్సరాల క్రితం సీతక్క ఆదేశాల మేరకు పనులు ప్రారంభమైనవి ఈరోడ్డు నాలుగు మీటర్ల వెడల్పు వేయాల్సి ఉండగా మూడు మీటర్ల వెడల్పు మాత్రమే వేసిండ్రు ఎదురొచ్చే వాహనాలకు ఇబ్బందుల అవుతున్నాయి అదే క్రమంలో ఒక్క మీటర్ మాత్రమే రోడ్డు వేసిండ్రు మూడు కిలోమీటర్లు కంకరు వేసి వదిలేసిండ్రు ఈకంకర్ రోడ్డుపై ప్రజలు టూవీలర్స్ తో తిరిగేవాళ్లు అనేక ప్రమాదాలకు గురవుతున్నారు కాళ్లు చేతులు విరిగిపోతున్నాయి కాబట్టి ఈరోడ్డుని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఇది వారి స్థానిక అనుమతులతో జాప్యంతో ఆలస్యం చేస్తున్నారు అది సరైనది కాదు మన మంత్రి సీతక్క ఉన్నది కాబట్టే సీతక్క మంత్రి సీతక్క వారి వెంట తీసుకొని రోడ్డు వెడల్పు కార్యక్రమాలు చేపట్టాలి అదేవిధంగా ఆరోడ్డుని పూర్తి చేయాలి అని కోరుతున్నాం ఈరోడ్డు బాగు లేకపోవడం వల్ల గర్భిణీ స్త్రీలు అంబులెన్స్ వెళ్లడానికి 104 వెహికల్ కూడా రావడం లేదు అదే విధంగా డెలివరీ కేసులు కోసం 108 వెహికల్ కూడా రావడం లేదు దీని వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు ప్రధానంగా పోచపూర్ అల్లి గూడెం గొల్లపల్లి బంధాల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు కాబట్టి పెండింగ్ లో ఉన్నరోడ్డు మరియు పోచపూర్ నుండి అల్లిగూడ నరసాపురం రోడ్డు మరియు పోచపురం నుండి గొల్లపల్లి రోడ్డు మరియు బొల్లెపల్లి నుండి అల్లిగూడెం నుండి నర్సాపూర్ రోడ్డు వెంటనే వేయాలి అని చెప్పి తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో ఐటీడీఏ ముందు ప్రజలను చైతన్యవంతం చేసి ధర్నా చేస్తామని తెలంగాణ ఆదివాసి ఈసం కృష్ణమూర్తి అల్లం మంగయ్య కోరం ముత్తయ్య ఆలం ప్రభాకర్ నాలి నాగేష్ కురుశం నరసయ్య మొదలగు ఆదివాసి గిరిజన సంఘం తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నూతన పనులకు శ్రీకారం

- **మూడు ప్రాంతాల్లో సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన**
- **గ్రామపంచాయతీ నిధులతో అవసరమైన చోట్ల మురుగునీటి కాలువల నిర్మాణం –**
- **సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**

బోనకల్,అక్టోబర్ 13, (డీడీ9 వార్త)

బోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ శ్రీకారం చుట్టారు. గ్రామంలో మురుగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో గ్రామ పంచాయతీ నిధులతో మూడు ప్రాంతాల్లో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ నిధులను సద్వినియోగం చేస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాభివృద్ధికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని వారు అన్నారు.

ఈ మూడు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు

1. చెన్న లక్ష్యాద్రి ఇంటి వద్ద నుంచి బానోత్ మురళి ఇంటి వరకు సైడ్ డ్రైనేజీ నిర్మాణం.
2. గద్దె నాగేశ్వరరావు ఇంటి వద్ద నుంచి ఇటుకల వెంకటస్వామి ఇంటి వరకు సైడ్ డ్రైనేజీ నిర్మాణం.
3. యార్లగడ్డ చిన్న నరసింహ ఇంటి వద్ద నుంచి దోమల ప్రసాద్ ఇంటి వరకు సైడ్ డ్రైనేజీ నిర్మాణం.

గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలను తగ్గించి, మురుగునీటి పారుదలకు మెరుగైన మార్గం కల్పించేందుకు ఈ పనులు ఉపయోగపడనున్నాయి ,అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోతు కొండ, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు.. యార్లగడ్డ కుమారి, మరీదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మీరా సాహెబ్, జరుపుల లావణ్య, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, మరియు గ్రామ పెద్దలు.. సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, బొమ్మ కంటి రంగారావు, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నాగేశ్వ



రరావు, నందమూరి సత్యనారాయణ, తేలూరి రమేష్ , యార్లగడ్డ శ్రీను, గంగుల పుల్లయ్య, మోర్ల శ్రీను, యార్లగడ్డ రమేష్, చిట్టూరి శ్రీనివాస ప్రసాద్, మోర్ల ఆంజనేయులు, బండి వెంకటేశ్వర్లు, ఒరుగు నరసింహారావు, టైగర్ విజయ్, గద్దె రామారావు మరియు పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు బోనకల్ బీసీ గురుకుల విద్యార్థుల ఎంపిక

బోనకల్,అక్టోబర్ 13, (డీడీ9 వార్త)



కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి 'అండర్ 19 చెస్ పోటీల'లో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బోనకల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలలో విద్యార్థులు ఈశ్వర్, లోకేష్, వరుణ్, మరియు ఆదిత్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. వీరు ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డిసిఓ (డిసిఓ), కళాశాల ప్రిన్సిపల్ సుష్మా,ఉమ్మడి ఖమ్మం జిల్లా (ఆర్ సి ఓ) సిహెచ్. రాంబాబు మాట్లాడుతూ... విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు పి. వెంకటేశ్వర్లు, పి. వెంకట్రావు మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆదివాసీ హక్కుల కోసం గూడెంలో ఉద్యమించాలి!

- **డిసెంబర్ 9న చలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలి: పాడెం బాబు..**

అక్టోబర్ 13: డిడి9 వార్త వెంకటాపురం.

ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం యువతీ యువకులు ఉద్యమాల్లో ముందుండాలని తుడుం దెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు పొడెం బాబు పిలుపునిచ్చారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తుడుం దెబ్బ మండల కమిటీతో పాటు ఆదివాసీ విద్యార్థి, రైతు, మహిళా సంఘాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పొడెం బాబు మాట్లాడుతూ.. ఆదివాసీల జల్, జంగల్, జమీన్ హక్కులతో పాటు విద్య, వైద్యం, ఉద్యోగాల సాధనకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. డిసెంబర్ 9న నిర్వహించే చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభకు వెంకటాపురం మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో కమిటీలను ఏర్పాటు చేసి సంఘాలను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని నాయకులు సూచించారు.

ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిసే బాలకృష్ణ, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అట్టం సుభద్ర, జిల్లా, మండల నాయకులు, ఆదివాసీ యువతీ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.




ఎల్టీఆర్ 1/70 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి..

- **వలస గిరిజనేతరుల ఇంటి పన్ను రసీదులు రద్దు చేయాలి: జీఎస్పీ, తుడుందెబ్బ..**

అక్టోబర్ 13 డిడి9 వార్త వెంకటాపురం.

ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో ఎల్టీఆర్ 1/70 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, చట్టవిరుద్ధ నిర్మాణాలకు జారీ చేసిన ఇంటి పన్ను రసీదులను రద్దు చేయాలని జీఎస్పీ, తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటాపురం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కణితి వెంకటకృష్ణ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. 20ఏళ్లుగా నివసిస్తున్న ఓ ఆదివాసీకుటుంబానికి ఇంటి పన్ను విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆరు నెలలుగా విద్యుత్ సౌకర్యం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసి, ఆదివాసీల హక్కులను కాపాడాలని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.





రామాలయం వద్ద అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

- **గోదావరి పుష్కరాల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి**
- **ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు రహదారి సుందరీకరణకు వారం రోజుల్లో ప్రణాళిక**
- **జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం**
- **క్షేత్రస్థాయిలో రామాలయ అభివృద్ధి, ఘాట్ పనులను పరిశీలించిన కలెక్టర్**

భద్రాచలం టౌన్, అక్టోబర్ 13 (డీ డీ 9 వార్త)


గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణం, భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆలయ అభివృద్ధి పనులు, గోదావరి ఘాట్లు, వైకుంఠధామం, సారపాక బ్రిడ్జి ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఆలయం నుంచి గోదావరి ఘాట్లకు వెళ్లే రహదారిని 25 అడుగుల నుంచి 30 అడుగులకు విస్తరించాలని సూచించారు. వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉత్తర వైపు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల మేర చేపడుతున్న పుష్కర ఘాట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారిని పుష్పించే మొక్కలతో సుందరీకరించేందుకు వారం రోజుల్లో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భక్తుల వసతి కోసం డార్మిటరీ హాల్, గోశాల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి, గోదావరి పుష్కరాల గడువులను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జూన్ 27 నుంచి జూలై 7 వరకు జరగనున్న పుష్కరాలకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, వైద్య సేవలు, పోలీసు భద్రత వంటి సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్ అండ్ బీ ఈఈ నాగేశ్వరరావు, దేవస్థానం డీఈ రవీందర్ రావు, తహసీల్దార్ రవికుమార్, ఇన్ చార్జి ఎంపీడీవో, జీపీఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అక్రమ గ్రావెల్ తవ్వకాలకు సహకరించిన వారిపై విచారణ చేపట్టాలి

చర్ల, అక్టోబర్ 13 (డిడి 9 వార్త)



చర్ల మండలంలోని లక్ష్మి కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టినట్లు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు దొర డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్రమ గ్రావెల్ తవ్వకాలకు ఉపయోగించినట్లు గుర్తించి సీజ్ చేసిన జేసీబీలు, టిప్పర్ లారీలకు సంబంధించి పూర్తి వివరాలను చర్ల మండల తహసీల్దార్ వెంటనే బహిర్గతం చేయాలని ఆయన కోరారు. లక్ష్మి కాలనీలో జరిగిన గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టి సీజ్ చేసిన జేసీబీలు, టిప్పర్ లారీలకు సంబంధించిన పూర్తి వివరాలతో తహసీల్దార్ శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. అక్రమ తవ్వకాలకు అనుమతులు ఇచ్చినవారు లేదా వాటికి సహకరించిన అధికారులు ఎవరైనా ఉంటే విచారణ జరిపి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని, ప్రజలకు సంబంధించిన సహజ వనరులను అక్రమంగా తవ్వి తరలిస్తుంటే సంబంధిత అధికారులు మౌనంగా ఉండటం తగదన్నారు. ఈ వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అన్నారు. వాహనాలను సీజ్ చేసినట్లు మాత్రమే కాకుండా, తదుపరి తీసుకున్న చర్యలను కూడా వెల్లడించాలి. దీనిపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి, లక్ష్మి కాలనీలో జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, లేనిపక్షంలో సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ఈ వ్యవహారాన్ని తీసుకెళ్లి, చట్టపరమైన మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం 5, 500 మాత్రమే లాభాల వాటా ప్రకటించడం దారుణం.

- **ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పునరాలోచన చేయాలి..**
- **సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10% లాభాల వాటా ప్రకటించాలి.**
- **ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (TUCI)రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి.**



మణుగూరు. అక్టోబర్ 13 (డి డి 9వార్త)

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కేవలం 5500 రూపాయలు లాభాల వాటా ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణమని, సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం పునరాలోచన చేసి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 10% లాభాల వాటా ప్రకటించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులు కూడా పనిచేస్తూ, సంస్థ లాభాలలో భాగస్వామ్యం అవుతున్నప్పటికీ, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్ష చూపటం దారుణం అన్నారు. సింగరేణికి లాభాలు రావడానికి కారణం కాంట్రాక్టు కార్మికులే అన్నారు. ఒక పర్మినెంట్ కార్మికుడికి ఇచ్చే వేతనం తోటి సుమారు పదిమంది కాంట్రాక్టు కార్మికులను నియమించుకొని వారి శ్రమ దోపిడీ చేయడం వలనే సింగరేణి కి లాభాలు వస్తున్నాయి అన్నారు. సింగరేణి లాభాలకు కారకులైన కాంట్రాక్టు కార్మికులను విస్మరించడం దారుణమన్నారు. సింగరేణికి నికర లాభం 1754 కోట్లు వచ్చినట్లు సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించి, నికర లాభాలలో పర్మినెంట్ కార్మికులకు 34% అనగా ఒక్కొక్క కార్మికుడికి 1, 53, 912 రూపాయలుగా ప్రకటించింది అన్నారు. వారికి 34% ప్రకటించడం సంతోషించదగ్గ విషయమే అయినప్పటికీ, కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం 5500 రూపాయలు ప్రకటించి చేతులు దులుపుకోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పునరాలోచన చేసి లాభాలకు కారకులైన సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు నికర లాభాలలో 10% లాభాల వాటా ప్రకటించాలని సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సింగరేణి కార్మికుల సంక్షేమానికి కీలక నిర్ణయాలు..

- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపిన పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ శ్రీ పాయం వెంకటేశ్వర్లు.**
- **కార్మికుల ఆదాయపు పన్ను భారం తగ్గించే నిర్ణయం చారిత్రాత్మకం – ఎన్నో ఏళ్ల కల నెరవేరే దిశగా అడుగులు**

మణుగూరు/ హైదరాబాద్, అక్టోబర్ 13 (డి డి 9వార్త)

సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలపై పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతూ, వారి ఆర్థిక భద్రత, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, గృహ వసతి తదితర అంశాలపై సానుకూల నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలను ప్రకటించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం కార్మిక కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు.

సింగరేణి కార్మికుల ఆదాయపు పన్నుపై కీలక నిర్ణయం

సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆదాయపు పన్ను సమస్యపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికులకు పెద్ద ఊరటనిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. సింగరేణి సంస్థలోని ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికులందరికీ కూడా సంస్థ నుంచే ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.దీర్ఘకాలంగా కార్మికులను ఆర్థికంగా ప్రభావితం చేస్తున్న ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం స్వాగతించదగినదని పేర్కొన్నారు. కార్మికుల వేతనాలపై పడుతున్న ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించే ఈ నిర్ణయం అమలుతో వారికి ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని, వారి కుటుంబాలకు మరింత భరోసా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న తమ సమస్యకు పరిష్కారం లభించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై సింగరేణి కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

15 రోజుల్లో పెండింగ్ కారుణ్య నియామకాలు పూర్తి

సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 మంది ఆధారిత ఉద్యోగుల నియామక ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి, అర్హులకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం కార్మిక కుటుంబాలకు ఊరటనిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఉద్యోగుల పేర్లలో మార్పులు, ఇతర వివరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సుమారు 136 దరఖాస్తులను మానవీయ కోణంలో పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు.కరోనా సమయంలో లేదా ఇతర పరిస్థితుల్లో అనధికారిక గైర్హాజరు కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన అర్హులైన కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, నిబంధనల ప్రకారం తిరిగి ఉద్యోగాల్లో చేరేందుకు ఒకసారి అవకాశం కల్పించే నిర్ణయం కార్మిక కుటుంబాలకు భరోసానిస్తుందని పేర్కొన్నారు.

కార్మికుల సొంతింటి కల సాకారం దిశగా చర్యలు

సింగరేణి సంస్థకు సంబంధించిన భూముల విషయంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు స్వాగతించదగినవని ఎమ్మెల్యే తెలిపారు. సింగరేణికి సంబంధించిన 5,774 ఎకరాల భూములను రెవెన్యూ శాఖకు అప్పగించగా, అందులో సుమారు 4,500 ఎకరాలను గతంలో పేదలకు పంపిణీ చేసినట్లు సమావేశంలో వివరించారని పేర్కొన్నారు.

గిలిన సుమారు 1,250 ఎకరాల్లో జీవో నంబర్ 76 ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయడం, నెల రోజుల్లో అర్హుల జాబితాను సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టడం పేదలకు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. అలాగే సింగరేణి పరిధిలో వినియోగంలో లేని భూములను గుర్తించి, ఉద్యోగులు, కార్మికుల కోసం 'నెహ్రూ హౌసింగ్ కాలనీలు' ఏర్పాటు చేయడం ద్వారా పదవీ విరమణ సమయానికి ప్రతి కార్మికుడికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన పాత క్వార్టర్ల స్థానంలో కొత్త గృహాలను నిర్మించాలనే ఆలోచన కూడా కార్మికుల నివాస సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందని తెలిపారు.



కార్మికులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో నిపుణులు, సూపర్ స్పెషలిస్టు వైద్యులను నియమించడం, అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచడం, గుండె సంబంధిత చికిత్సలు, క్యాథ్ ల్యాబ్ వంటి ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలనే నిర్ణయం కార్మికులకు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం వల్ల కార్మిక కుటుంబాలతోపాటు స్థానిక ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

దసరా బోనస్‌తో కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా

సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో 34 శాతం వాటాను శాశ్వత ఉద్యోగులకు దసరా బోనస్‌గా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడం కార్మికుల శ్రమకు తగిన గుర్తింపునివ్వడమేనని ఎమ్మెల్యే అన్నారు. అర్హులైన ప్రతి శాశ్వత ఉద్యోగికి సగటున రూ.1,53,912 బోనస్ అందించనున్నట్లు ప్రకటించడం, కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ ఇవ్వడం కార్మిక కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడుతుందని తెలిపారు.కార్మికుల భద్రత కోసం ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్లు అందించడం, ప్రమాద బీమా సదుపాయాలను పటిష్టం చేయడం, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వడం వంటి చర్యలు కార్మికుల భద్రతకు మరింత భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.

సింగరేణి ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

సింగరేణి కాలనీల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలకు సోలార్ విద్యుత్ సదుపాయాలు కల్పించడం వంటి నిర్ణయాలు ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడతాయని ఎమ్మెల్యే తెలిపారు.సింగరేణి అధికారులకు పనితీరు ఆధారిత ప్రోత్సాహక వేతనం (Performance Related Pay) కల్పించే అంశం కూడా సంస్థలో పని సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు

సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను సమస్య నుంచి కారుణ్య నియామకాలు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, వైద్య సదుపాయాలు, బోనస్, ఉద్యోగ భద్రత వరకు అనేక అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవడం కార్మిక సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారికి, సంబంధిత మంత్రులకు, అధికారులకు, సింగరేణి యాజమాన్యానికి ఆయన మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక భద్రత, సింగరేణి ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



పట్టభద్రుల ఓటరు నమోదు విస్తృతంగా చేపట్టాలి

- **బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పిలుపు**

భద్రాచలం టౌన్ (డి డీ 9 వార్త):

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓట్ల నమోదు అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

పార్టీ నాయకులందరూ సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టభద్రుల సమస్యలు, వారి హక్కులు, ప్రజాస్వామ్య ప్రక్రియలో వారి భాగస్వామ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నాయకులు చర్చించారు. ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పొందేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.


ఈ సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ, సీనియర్ నాయకులు కోటగిరి ప్రబోధ్‌కుమార్, వాజేడు మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి, వెంకటాపురం మండల అధ్యక్షుడు గంప రాంబాబు, చర్ల మండల పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, దుమ్ముగూడెం మండల పార్టీ కన్వీనర్ కణితి రాముడు, మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్, కోకన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, అయినవోలు పవన్‌కుమార్, సోమిడి నరసింహారావు, ఎండీ జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.


గుండాల మండల అగ్రి ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు

- **అధ్యక్షుడిగా జిమ్మిడి సాంబయ్య, కార్యదర్శిగా పల్లెర్ల రవివర్మ ఎన్నిక**

గుండాల అక్టోబర్ 13 (డిడి 9వార్త).

గుండాల: గుండాల మండల అగ్రి ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. యూనియన్‌ను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగుల మధ్య ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా జిమ్మిడి సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల రవివర్మ, కోశాధికారిగా జనగం అశోక్, ఉప కార్యదర్శిగా బొమ్మల రవి ఎన్నికయ్యారు. యూనియన్ సభ్యులుగా శేషు, వంశీ, రమేష్, ప్రభాకర్, రవి ప్రభాకర్, నవీన్, రాయుడు, మోహన్, బాలకృష్ణ, సాంబశివరావు, ప్రేమ్ కుమార్, సుధాకర్ ఉన్నారు. నూతన కమిటీ ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించింది. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, పరస్పర సహకారానికి ప్రాధాన్యతనిస్తూ యూనియన్‌ను మరింత పటిష్టంగా ముందుకు తీసుకెళ్లాలని సభ్యులు ఆకాంక్షించారు. సభ్యులందరి సహకారంతో సంఘ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని నూతన కమిటీ నిర్ణయించింది.






కళ్ళ ముందు అభివృద్ధి మరియు పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతున్న కావాలనే విషపు ప్రచారం..

- **అభివృద్ధి ఎమ్మెల్యే పాయం ఎజెండా -- తప్పుడు ప్రచారం చేయటం ప్రతిపక్ష ఎజెండా..**

మణుగూరు. అక్టోబర్ 13 (డి డి 9వార్త)

మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో అంబేద్కర్ సెంటర్ నుండి సాయిబాబా గుడి వరకు గల ప్రధాన రహదారిని గత రెండు రోజుల నుండి రోడ్డుపై ఏర్పడ్డ ఇసుక మట్టిని పంచాయతీ సిబ్బంది మరియు ట్రాక్టర్లు మరియు జెసిబి ల ద్వారా తొలగించడం జరిగిందని సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు ఎస్కే రహీం పాషాలు ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్నటువంటి పారిశుధ్యం మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకొని వాస్తవాలు తెలుసుకోవాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అభివృద్ధి ఎజెండాగా పనిచేస్తున్నారని వారి సహకారంతో గతంలో కంటే భిన్నంగా సమితి సింగారం గ్రామపంచాయతీలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను అమలుచేయడం జరుగుతుందని తెలియజేశారు.



బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

- **బతుకమ్మతో మెడికల్ కాలనీలో సంబరాలు**

భద్రాచలం టౌన్, అక్టోబర్ 13 (డి డీ 9 వార్త)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు భద్రాచలం పట్టణంలోని మెడికల్ కాలనీలో మూడో రోజు పప్పు బతుకమ్మతో వైభవంగా జరిగాయి. శ్రీ ద్వారకా సాయి కనక ముత్యాలమ్మ తల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆట పాటలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.మహిళల సందడి, బతుకమ్మ పాటలతో మెడికల్ కాలనీ పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతిని ఆరాధించే సంప్రదాయానికి బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తున్నాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.





బొగ్గు రవాణా లారీ డ్రైవర్లకు ఐఎఫ్‌టీయూ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు ఏ. మంజిలాల్ హెచ్చరిక..

- **ప్రమాదకర మలుపుల వద్ద వాహనాలను జాగ్రత్తగా నడపాలి.**

మణుగూరు. అక్టోబర్ 13(డి డి 9వార్త)

మణుగూరు సింగరేణి ఏరియాలో సివిల్ కనకదుర్గమ్మ గుడి, జీఎం ఆఫీస్ సింగారం టర్నింగ్, మెయిన్ చెక్ పోస్ట్ టర్నింగ్, ఏరియా స్టోర్ టర్నింగ్, కేసీఎన్‌పీ టర్నింగ్ ప్రాంతాలు అత్యంత ప్రమాదకరమైన టర్నింగ్ లుగా ఉన్నాయి. ఈ ప్రాంతాలలో కొందరు వాహన డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారని ఐఎఫ్‌టీయూ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు ఏ.మంగీలాల్ ఆందోళన వ్యక్తం చేశారు.సింగరేణి రోడ్డు రవాణాపై వాహన డ్రైవర్లు సేఫ్టీ నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ వాహనాలు నడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం సుమారు 04:00 గంటల సమయంలో ప్రధాన చెక్ పోస్ట్ దగ్గర రోడ్డు స్వీపింగ్ కాంట్రాక్ట్ కార్మికురాలు అనసూయ రోడ్డు శుభ్రం చేస్తుండగా, ఒక బొగ్గు లారీ ముందు భాగం తగలడంతో ప్రమాదం జరిగింది. డ్రైవర్ చూసుకోకుండా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు తెలిపారు. తోటి కార్మికులు గట్టిగా కేకలు వేయడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది.


సమాచారం తెలుసుకున్న వెంటనే ఏరియా ఐఎఫ్‌టీయూ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు ఏ. మంగిలాల్ స్థానిక సింగరేణి వైద్యశాలకు వెళ్లి గాయపడిన కార్మికురాలు అనసూయను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ ఓనర్ నుండి కాంట్రాక్ట్ కార్మికురాలు పూర్తిగా కోలుకునేంత వరకు ఆర్థికంగా సహకారం అందించాలని డిమాండ్ చేశారు. "లారీ డ్రైవర్ల సురక్షిత ప్రయాణం కోసం నిరంతరం రోడ్లపై ఉన్న రాళ్లు, రప్పలను తొలగిస్తూ, రోడ్లను శుభ్రం చేసే కార్మికులు రోడ్డుకి ఇరువైపులా ఎల్లవేళలా కనిపిస్తూ ఉంటారు. వారిని గమనిస్తూనే మీ వాహన ప్రయాణాన్ని కొనసాగించాలని" ఆయన లారీ డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు వెంకన్న, సుందరం తదితరులు పాల్గొన్నారు.


సంతాన లక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

- **సంతానలక్ష్మి అలంకారంలో లక్ష్మీ తాయారు అమ్మవారు**

భద్రాచలం టౌన్, అక్టోబర్ 13 (డి డీ 9 వార్త)

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీ తాయారు అమ్మవారు మంగళవారం సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక స్నపనం, అష్టోత్తరం, సామూహిక కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం కొనసాగింది. బుధవారం అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు









కందకుర్తి, యంచ పుష్కర ఘాట్లపై ప్రత్యేక దృష్టి.. పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశం


నిజామాబాద్, అక్టోబర్ 13 (డీడీ 9 వార్త):

గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. మంగళవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి రెంజల్ మండలం కందకుర్తి, నవీపేట మండలం యంచలో పుష్కరాల కోసం చేపడుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

గోదావరి, మంజీర, హరిద్ర నదులు కలిసే త్రివేణి సంగమ క్షేత్రమైన కందకుర్తిలో పుష్కర ఘాట్ నిర్మాణం, ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో నీటిపారుదల శాఖకు సంబంధించిన కొన్ని పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు వివరించారు. ప్రవాహం తగ్గగానే పనులు ప్రారంభించి మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణాల పురోగతిని ఆర్డీఓ, తహసీల్దార్లు వారానికి కనీసం రెండుసార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఘాట్లకు చేరుకునే రహదారులు, కల్వర్టుల నిర్మాణాలను ఇతర పనులతో సమన్వయం చేసుకుంటూ చేపట్టాలని పేర్కొన్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీసుల పెట్రోలింగ్‌తో పాటు గ్రామ పాలన అధికారులు, లష్కర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

యంచలో ఏర్పాటు చేయనున్న పుష్కర ఘాట్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్.. భక్తుల రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, వాహనాల పార్కింగ్, దుస్తులు మార్చుకునే గదులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పిండ ప్రదానం, కేశఖండన కార్యక్రమాల కోసం ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పించి, భద్రతతో కూడిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఏర్పాటుచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ పర్యటనలో బోధన్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకటరమణతో పాటు దేవాదాయ, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.







డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- **నిజామాబాద్ నగరంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

నిజామాబాద్, అక్టోబర్ 13, డీడీ 9వార్త:

అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 50, 7, 20వ డివిజన్లలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. నగర అభివృద్ధికి కీలకమైన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ మంజూరు కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. కొన్ని డివిజన్లలో రూ.కోటి విలువైన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని చోట్ల త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అమృత్ 2 పథకం కింద నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ యూజీడీ పనులు కొనసాగుతున్నాయని, వాటిని మరింత వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతిపై తగిన సూచనలు చేసినట్లు తెలిపారు. నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా నూతనంగా తొమ్మిది నీటి ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ఇందూరుకు చారిత్రక గుర్తింపునిచ్చే ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్‌వే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇటీవల అధికారులు, కంపెనీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి, 7వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, 20వ డివిజన్ కార్పొరేటర్ న్యాలం సునీత, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.









ఎల్ ని నో ప్రభావంతో. పంట నష్టపోయిన రైతులను. ఆదుకోవాలి. ఆదివాసి సంఘాలు

అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం డి డి 9 వార్త

తలమడుగు మండలంలోని. ఆదివాసి సంఘాల నాయకులు. తాసిల్దార్ రాజ్ మోహన్ ను కలిసి మేమో రాండం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆదివాసి నాయకులు మాట్లాడుతూ. ఈ సంవత్సరం. ఎల్ నీ నో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయ్. పంటలు సరిగా పండగ అప్పుల పాలయ్యారు. కావున రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న పంట రుణాలను. అలాగే ఇవాళ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు. ఒక్కొక్కరికి 20 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని. అలాగే తలమడుగు మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి ఆదుకోవాలని. ఆదివాసి హక్కుల పోరాట సమితి. అలాగే తుడుం దెబ్బ. ఆదివాసీ సంక్షేమ పరిషత్. మరియు. వివిధ గ్రామాల పటేళ్లు మహాజన్. దేవారి. సర్పంచులు. మాజీ సర్పంచులు. మరియు మాజీ ఎంపీటీసీలు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో. ఆదివాసి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు. కుమ్ర జ్ఞానేశ్వర్. మండల అధ్యక్షుడు. జంగాల పోచన్న. మండల వర్కింగ్ ప్రెసిడెంట్. గోడం భుజంగరావు. ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యదర్శి. ఆత్రం అంకుష్. ఝరి సర్పంచ్ మేస్రం రూప కాశిరాం. పెందుర్ జైతు పటేల్ . పేందూరు మాధవరావు. మహాజన్. నైతం రాము. సలాం రవీందర్. మేస్రం దేవరావు. మాజీ సర్పంచ్. సూర్యభన్. మాణిక్ రావు హేమంత్. రాము. తదితరులు పాల్గొన్నారు



రాష్ట్రస్థాయి ఖో–ఖో పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిలా బాలికల జట్టు

నిజామాబాద్, అక్టోబర్ 13, డీడీ 9వార్త:

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో ప్రతిభ చాటేందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ బాలికల జట్టు సన్నద్ధమైంది. నందిపేట మండల కేంద్రంలోని శ్రీ గీతా కాన్వెంట్ హైస్కూల్‌లో జట్టుకు నిర్వహించిన పది రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ నెల 4న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం 13వ తేదీ వరకు కొనసాగింది. కామారెడ్డిలో సెప్టెంబర్ 28న నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారిణులకు శిబిరంలో శిక్షణ ఇచ్చారు. పీడీ మీసాల సుజాత, పీఈటీలు ఆస్మా బేగం, ఎస్. గంగారెడ్డి, జి. ముత్యం క్రీడాకారిణులకు మెళకువలు నేర్పించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఖో-ఖో పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో క్రీడాకారిణులు పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ఆకాంక్షించారు. శిబిరంలో పాల్గొన్న బాలికలకు భోజన వసతితోపాటు క్రీడా దుస్తులను శ్రీ గీతా కాన్వెంట్ హైస్కూల్ యాజమాన్యం సమకూర్చింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నందిపేట సర్పంచ్ ఎర్రం లింగం మాట్లాడుతూ క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నందిపేటలో భవిష్యత్తులో ఖో-ఖో పోటీలు నిర్వహిస్తే తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.డి. అతీకుల్లా, పీడీ మీసాల సుజాత, ఎన్. మధుసూదన్ రెడ్డి, ఎస్. గంగారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కాసూరి గంగా సాగర్, అశోక్, లింగం, నరేష్ రెడ్డి, ఆస్మా బేగం తదితరులు పాల్గొన్నారు.



కేర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా నానబియ్యం బతుకమ్మ వేడుకలు

నిజామాబాద్, అక్టోబర్ 13, (డీడీ 9వార్త)


తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కేర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు ఉత్సాహంగా జరుపుకున్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటలతో సందడి చేశారు. కళాశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, కోలాహలంతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు మాట్లాడుతూ ప్రకృతిలో లభించే పూలను దైవ స్వరూపంగా భావించి పూజించడం తెలంగాణ సంస్కృతిలోని గొప్ప ఆధ్యాత్మిక భావనకు నిదర్శనమని అన్నారు. ప్రకృతిని ఆరాధించడం, పూలకు ప్రాధాన్యతనివ్వడం బతుకమ్మ పండుగ ప్రత్యేకతలని పేర్కొన్నారు. ఇలాంటి పండుగల నిర్వహణతో విద్యార్థినులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరగడంతోపాటు ఐక్యత, సాంస్కృతిక విలువలు అలవడతాయని తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగను కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు అనురాధ, సునీతా రాణి, మౌనిక, గంగమణి, శ్రీవిద్య, శ్రీలత, అరుణతోపాటు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నిర్మాణాలపై పంచాయతీ దృష్టి.. మేస్త్రీలకు సర్పంచ్ సూచనలు

- **నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు చేపట్టాలి**

నిజామాబాద్, అక్టోబర్ 13, డీడీ 9వార్త:

గ్రామంలో నూతన భవనాలు, గృహ నిర్మాణాలు చేపట్టే సమయంలో నిబంధనలు పాటించాలని కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ సూచించారు. గ్రామంలో నిర్మాణ పనులు క్రమబద్ధంగా సాగడంతోపాటు పంచాయతీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతన భవనాలు, ఇళ్ల నిర్మాణాల సమయంలో పంచాయతీ రాజ్ నిబంధనలకు అనుగుణంగా రెండు అడుగుల సెట్‌బ్యాక్ వదిలి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను విస్మరించకుండా నిర్మాణ పనులు చేపట్టి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని మేస్త్రీలకు సూచించారు. ఇళ్ల నిర్మాణం సందర్భంగా లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని తెలిపారు. ప్రభుత్వ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి సకాలంలో పనులు పూర్తయ్యేలా మేస్త్రీలు బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ తక్కూరి శేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు సురేష్, అజయ్, నాయకులు సాధుల్లా, సతీష్, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.





నాందేవ్‌వాడలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్, అక్టోబర్ 13 (డిడి 9 వార్త):

నగరంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నగరంలోని 36వ డివిజన్ నాందేవ్‌వాడలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. శరన్న వరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాందేవ్‌వాడలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ ధాత్రిక రేవతి పరమేశ్వర్‌తో పాటు అమ్మవారి మండప నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ నీటి పొదుపును పాటించాలి

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం
అక్టోబర్ 13: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు బొట్టు బొట్టు ను ఒడిసి పట్టు చేతి పంపు కొట్టు నీటిని బిందెలో పట్టు భవిష్యత్ తరాలకు భద్రంగా అందించాలి వృధాను అరికట్టాలి చేతిపంపులతో చెలిమెల నీరు దన్నూరు బి పంచాయతీ పాలకవర్గం మండలంలోని దన్నూరు బి గ్రామ పంచాయతీ పాలకవర్గం నీటిని వృధా ను అరికట్టే చర్యలను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని చేతి పంపు బోరులను బాగు చేయించి కాలనీలలో గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా కరెంటు మోటార్ ద్వారా నడవడం మూలంగా నీరు అనేకంగా వృధా కావడం చూసి
దానిని ఎలాగైనా అరికట్టాలని ఉద్దేశంతో చేతిపంపుల బోర్లను ఉపయోగించేలా ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులను

దీటుగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త గా నీటిని ఒడిసిపట్టే చర్యలను ఇప్పటినుండే గ్రామంలో తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

కోటా (కే) లో ఘనంగా దుర్గామాత పూజా కార్యక్రమం

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం:
అక్టోబర్ 13: (డిడి 9 వార్త న్యూస్):

దేవీ నవరాత్రులలో భాగంగా సోనాల మండలంలోని కోట కే గ్రామంలో ఘనంగా దుర్గామాత మండపాల వద్ద మహిళలు పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మంగళహారతులతో కోలాటాలతో భజన కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు









వికలాంగులకు భాస్కరన్న భరోసా

బాన్సువాడ, అక్టోబర్ 13(డిడి9 వార్త):

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని దివ్యాంగులకు అండగా నిలిచేందుకు భాస్కరన్న ముందుకు వచ్చారని బీర్కూర్ మండల నాయకులు తెలిపారు. మండల పరిధిలోని దామరంచ ఫకీరి షబ్బీర్, రైతునగర్ కొమ్మినేని నాగేశ్వర్ రావు, చించోలి చాకలి బాలరాజ్ లను కాళ్లు, చేతులు కోల్పోయిన వారిగా గుర్తించి, వారి వివరాలను సేకరించి భాస్కరన్న దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ కాళ్లు, చేతులను లండన్ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయించి తెప్పించి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి సహాయం అందించి, వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు భాస్కరన్న భరోసా కల్పిస్తున్నారని మండల నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్, యువనాయకులు మియాపురం శశికాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, మండల ఉపాధ్యక్షులు గొండ్ల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గొండ్ల రాజు, ఆత్మకమిటీ డైరెక్టర్ సందుల రవి, వార్డు మెంబర్లు కొరిమె రఘు, ప్రశాంత్ యాదవ్, ఇందూరి గజేందర్, లక్ష్మినారాయణ, హైమద్, జంగం గంగప్ప, చింతం



అంబయ్య, మేత్రి గంగారాం తదితరులు



పాల్గొన్నారు.

టీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ ఉప సర్పంచ్ సిడాం దేవ్ రావ్..

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 13: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సిడాం దేవ్ రావ్ నియామకం.. కండువా కప్పి ఆహ్వానించిన రాథోడ్ బాపురావు
ఆదిలాబాద్ జిల్లా: బోథ్ నియోజకవర్గం సోనాల* మండలంలోని వజ్జర్ (మాహదుగూడా) గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ మాజీ ఉప సర్పంచ్ సిడాం దేవ్ రావ్ తన అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదిలాబాద్ కేంద్రం టైలర్స్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిడాం దేవ్ రావ్‌ను తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ సోనాల మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు గిరిజనుల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువచ్చి, వారి హక్కులు మరియు సంక్షేమం కోసం పనిచేయాలని ఈ సందర్భంగా సూచించినట్లు తెలిసింది. అనంతరం నూతనంగా నియమితులైన సోనాల మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సిడాం దేవ్ రావ్‌ను శాలువాలతో సత్కరించారు. వజ్జర్ (మాహదుగూడా) గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్‌తో పాటు ఆయన అనుచరులు పార్టీలో చేరడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్న నాయకులు పార్టీలో చేరడం ద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతనంగా పార్టీలో చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.



పార్టీ ఆశయాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల్ కన్వీనర్ సదానందం స్థానిక టీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు యువత తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం, ఇష్టారాజ్య వైఖరి

- **హంగర్గ పంచాయతీ కార్యదర్శి నిర్బంధం, కార్యాలయానికి తాళం!**

నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 13(డిడి9 వార్త):

పోతంగల్ మండల పరిధిలోని హంగర్గ గ్రామ పంచాయతీలో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. "నేనే రాజు.. నేనే మంత్రి" అన్నట్లుగా వ్యవహరిస్తూ, గ్రామ పాలకవర్గాన్ని సైతం లెక్కచేయకుండా ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి గంగారాం తీరుపై గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఒక్కసారిగా తిరగబడ్డారు. కార్యదర్శి అవినీతి, అక్రమాలకు నిరసనగా గ్రామస్థులు ఆగ్రహంతో ఆయనను పంచాయతీ కార్యాలయంలోనే నిర్బంధించి, ఆఫీసుకు తాళం వేసి బైఠాయించారు. ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి విచారణ జరిపి, తమకు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు.

పాలకవర్గం, గ్రామస్థుల తీవ్ర ఆరోపణలు
ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నీరడి ఉదయ్ భాస్కర్, ఉపసర్పంచ్ డి. గోపాల్, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ పెద్దలు కార్యదర్శి గంగారాం వైఖరిపై పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు. గ్రామసభల్లో నిధుల జమా ఖర్చుల వివరాలను అడిగితే చూపించకుండా ప్రశ్నించిన వారిని దాటవేస్తున్నారని మండిపడ్డారు. వారు వెల్లడించిన ప్రధాన ఆక్రమాల్లో కొన్ని:
రశీదులు లేని వసూళ్లు ఎలాంటి అధికారిక రశీదులు ఇవ్వకుండా ప్రతి సర్టిఫికేట్‌కు రూ. 500 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారు.
* ఇంటి నంబర్ల కేటాయింపులో అక్రమాలు: ఇంటి నంబర్ పేరు మార్పిడి కోసం ఎలాంటి బిల్లులు లేకుండానే పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. పాలకవర్గానికి కనీస సమాచారం ఇవ్వకుండా, లంచాలకు ఆశపడి ఇష్టానుసారంగా ఇంటి నంబర్లు కేటాయిస్తూ అక్రమాలకు పాల్పడ్డారు.
* పన్నుల నిధుల గోల్‌మాల్: రశీదు పుస్తకాల్లో ఖాళీలు వదులుతూ నిధుల అవకతవకలకు తెరలేపారు. గ్రామస్థుల నుండి వసూలైన పన్నుల సొమ్ములో దాదాపు రూ. 40 వేల నుండి రూ. 50 వేల వరకు ప్రభుత్వ బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు.
* ఒక్క రోజే లక్షల్లో నకిలీ ఖర్చులు: గత జనవరి నెలలో కేవలం ఒక్క రోజులోనే ఎన్నికల ఖర్చుల పేరిట రూ. 39,000, రూ. 24,000, రూ. 20,000 విత్‌డ్రా చేయడంతో పాటు, ఎంబీ (Measurement Book) నమోదు కోసం రూ. 32,000 ఖర్చయినట్లు చూపిస్తూ నిధులను భారీగా దుర్వినియోగం చేశారు.

రంగంలోకి దిగిన అధికారులు – రికార్డుల స్వాధీనం:


గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడం, కార్యదర్శి నిర్బంధానికి గురికావడం వంటి విషయాలు తెలుసుకున్న జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించారు. అయితే ప్రస్తుతం మండల ఉన్నతాధికారులు శిక్షణలో ఉండటంతో, వారి ఆదేశాల మేరకు 'మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం' ప్రతినిధులు అత్యవసరంగా హంగర్గ గ్రామానికి చేరుకున్నారు.
అనంతరం సర్పంచ్ ఉదయ్ భాస్కర్, మండల సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ సింధె షాజీ పాటిల్, ఉపసర్పంచ్ డి. గోపాల్, మండల ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పెద్దలతో అధికారులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అందోళనకారులను శాంతింపజేసి, అందరి సమక్షంలో కార్యదర్శి గంగారాం ఆధీనంలో ఉన్న గ్రామ పంచాయతీ అధికారిక రికార్డులను, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.





ఎం బీ బీ ఎస్ సీటు సాధించిన సాయి చరణ్‌కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అభినందనలు

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 13: (డిడి 9 వార్త న్యూస్):



ఈరోజు బోత్ మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన సాయి చరణ్ ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలో ఎం బీ బీ ఎస్ సీటు సాధించిన సందర్భంగా గౌరవ బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆయనను అభినందించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సాయి చరణ్‌ను శాలువాతో సత్కరించి, వైద్య విద్యలో సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి వైద్య విద్యలో సీటు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకుని, వైద్యుడిగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.
సాయి చరణ్ సాధించిన ఈ విజయం యువతకు స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సూచించారు.

గ్రామపంచాయతీ కార్మికుడికి ఆర్థిక సాయం

- **స్నేహితుల అభివృద్ధి ఫోరం కమిటీ కౌట(బి)**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 13:(డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండలంలోని కౌట బి గ్రామ పంచాయతీ కార్మికుడు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న. గంగాధర్ వీరేష్$%నర్సయ్య బాగా పేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావున వాళ్ళ కుటుంబానికి ఆర్థిక పరిస్థితి బాగా లేదు. వారికి చేయుతగా స్నేహితుల అభివృద్ధి ఫోరం నుండి 5వేల రూపాయలు అంద జేయడం జరిగింది.. కొంకటి గంగాధర్ మాజీ సర్పంచ్ 2000 రూపాయలు అంద జేయడం జరిగింది....



రాజులగూడకు చెందిన యువకులు టీఆర్ఎస్‌లో చేరిక

- **ఇచ్చోడ పార్టీ కార్యాలయంలో కండువాలు కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు రాథోడ్ బాపురావ్**

ఆదిలాబాద్ జిల్లా (బ్యూరో అక్టోబర్ 13: (డిడి9 వార్త):



బోథ్ నియోజకవర్గం: బజార్హత్నూర్ మండలం రాజులగూడ గ్రామానికి చెందిన పలువురు బి ఆర్ ఎస్* నుండి యువకులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇచ్చోడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాల పట్ల ఆకర్షితులై యువత పార్టీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. చంద్రశేఖర్ కు ఎస్సీ సేల్ బజర్హత్నూర్ మండల చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంతో రాజులగూడ గ్రామంలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని స్థానిక నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. యువకుల చేరికతో గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజులగూడ గ్రామానికి చెందిన యువకులు తదితరులు పాల్గొన్నారు.







చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం..రజక సంఘ నాయకుల నిరసన..

- **నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్...**

మెదక్ అక్టోబర్ 13 (డిడి9 వార్త)



మెదక్ జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడం కలకలం రేపింది. ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి, సంయమనం పాటించాలని రజక సంఘ నాయకులకు సూచించారు. ఘటన పై దర్యాప్తు చేసి నిందితులను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. సీసీ కెమెరాల నిఘా, విగ్రహానికి భద్రత కల్పించడంలో నిర్లక్ష్యం పై రజక సంఘం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఘటనాస్థలికి చేరుకుని సంఘం నాయకులకు మద్దతు తెలిపారు. అనంతరం ఈ ఘటన పై రజక సంఘం నాయకులు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.







ఐలమ్మ విగ్రహం ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్**

మెదక్ అక్టోబర్ 13 (డిడి9 వార్త)



మెదక్ జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడంపై మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్ తోడుపునూరి శివరామ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు భూపతి రాజ్, షామి యుద్దీన్, చెదల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.





చైల్డ్ పోర్నోగ్రఫీపై పోలీసుల ప్రత్యేక నిఘా.. బోథ్ సర్కిల్ పరిధిలో నాలుగు కేసులు నమోదు

- **వీడియోలు చూడటం, అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం చట్టరీత్యా నేరం**
- **బోథ్ సీఐ డి గురుస్వామి**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం అక్టోబర్ 13: (డిడి 9 వార్త న్యూస్):



చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలు వీక్షించడం, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బోథ్ సీఐ డి. గురుస్వామి హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ టీం సహకారంతో ఇలాంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి, నిందితులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. బోథ్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు నాలుగు కేసులు నమోదు కాగా, బజార్హత్నూర్‌లో ముగ్గురిపై, బోథ్‌లో ఒకరిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ఆన్‌లైన్ వినియోగంపై పర్యవేక్షణ ఉంచాలని, ఇలాంటి ఘటనలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



బాధితులకు ఆపన్నహస్తం

- **పోతంగల్ మండలంలో 'భాస్కర్ అన్న భరోసా' ద్వారా వికలాంగుల వివరాల సేకరణ**

నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 13 (డిడి9 వార్త):

పోతంగల్ మండల కేంద్రంలో వివిధ రకాల ప్రమాదాల బారిన పడి అంగవైకల్యంతో బాధపడుతూ, సమాజంలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు 'భాస్కర్ అన్న భరోసా' కార్యక్రమం కొండంత అండగా నిలుస్తోంది. బాధితులను అన్ని విధాలా ఆదుకొని, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే పరమావధిగా ఈ సేవా కార్యక్రమాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

ఇందులో భాగంగా, పోతంగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేకంగా సర్వే నిర్వహించి బాధితులను గుర్తించే ప్రక్రియను చేపట్టారు. క్షేత్రస్థాయిలో పారదర్శకంగా వివరాలను సేకరించడం కోసం ఆయా గ్రామాల సర్పంచులను, స్థానిక ప్రజాప్రతినిధులను మరియు వివిధ గ్రామాల నాయకులను నిర్వాహకులు ముందుగా సంప్రదించారు. వారి సమన్వయంతో మండలంలోని గ్రామ గ్రామాన ఉన్న అంగవైకల్యం కలిగిన బాధితుల ఇళ్లను నేరుగా సందర్శించి, వారి పూర్తి వ్యక్తిగత మరియు ఆరోగ్య వివరాలను సేకరించారు.

ఈ సందర్భంగా బాధితులను కలిసి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ కూడా అధైర్యపడాల్సిన అవసరం లేదని, 'భాస్కర్ అన్న భరోసా' ద్వారా బాధితులందరికీ భవిష్యత్తులో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందించి అండగా ఉంటామని నిర్వాహకులు మాట ఇచ్చారు.

సమాజంలో అత్యంత ఆదరణ అవసరమైన వికలాంగుల కోసం చేపట్టిన ఈ మానవతా కార్యక్రమంలో పలువురు కీలక నాయకులు మరియు ప్రజాప్రతినిధులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంధపు పవన్ కుమార్. మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు. సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు షాజీ• మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం ప్రముఖ నాయకులు ధనరాజ్ మండలంలో నిరుపేద వికలాంగుల గుర్తింపునకు పూనుకోవడం, వారికి సాయం అందిస్తామంటూ ముందుకు రావడం పట్ల బాధితుల కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోడిచెర్ల ఎంపీ యూపీఎస్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 13(డిడి9 వార్త):

పోతంగల్ మండల కేంద్రంలో కోడిచెర్ల గ్రామంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (ఎంపీ యూపీఎస్) లో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను పాఠశాల ఆవరణలో ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం), ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాఠశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి, సాంప్రదాయ దుస్తుల్లో హాజరై సందడి చేశారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లతో, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా భక్తిశ్రద్ధలతో మారుమోగింది. ఈ సంబరాల్లో విద్యార్థిని విద్యార్థులతో పాటు గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. గ్రామీణ సంస్కృతిని, ఐక్యతను చాటిచెప్పేలా సాగిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.





రికార్డుల గిల్.. పరుగుల రాణి షెఫాలీ..
ఐసీసీ అవార్డులు వీరికే!

- గిల్‌కు ఐదోసారి పురుషుల ప్లేయర్ ఆఫ్ ద మంత్ పురస్కారం
- షెఫాలీకి రెండోసారి మహిళల విభాగంలో అవార్డు
- వెస్టిండీస్‌పై గిల్ 110, 223 పరుగులతో సత్తా
- షెఫాలీ ఆసియా కప్‌లో 360 పరుగులు, ఆరు వికెట్లు
- ఆసియా క్రీడల సెమీఫైనల్లో షెఫాలీ అజేయ శతకం

డీడీ9 వార్త :

భారత ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, షెఫాలీ వర్మ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెలుచుకున్నారు. సెప్టెంబర్ 2026కు గానూ ప్రకటించిన పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి అందుకున్నాడు. మహిళల విభాగంలో షెఫాలీ రెండోసారి ఈ అవార్డును సొంతం చేసుకుంది. ఆసియా కప్, ఆసియా క్రీడల్లో షెఫాలీ రాణించగా.. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అదరగొట్టాడు.

గిల్ రికార్డు.. ఐదోసారి అవార్డు

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ అద్భుత ప్రదర్శన చేశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాతి మ్యాచ్‌లో 133 బంతుల్లో 223 పరుగులతో చెలరేగాడు. లక్ష్య ఛేదనలో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. 406 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ మరో 39 బంతులు మిగిలుండగానే ఛేదించింది.

గతంలో 2023 జనవరి, సెప్టెంబర్, 2025 ఫిబ్రవరి, జులై నెలల్లో గిల్ ఈ అవార్డు అందుకున్నాడు. తాజా పురస్కారంతో ఐదుసార్లు ఈ ఘనత సాధించిన ఆటగాడిగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నాడు. వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ కూడా ఐదుసార్లు ఈ అవార్డును గెలుచుకున్నాడు.

షెఫాలీకి రెండోసారి..

మహిళల విభాగంలో షెఫాలీ వర్మ తన బ్యాటింగ్ జోరుతో ఆకట్టుకుంది. ఆసియా కప్‌లో భారత్ విజయంలో కీలకంగా నిలిచింది. ఆ టోర్నీలో 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. 184.61 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేసింది. ఆసియా క్రీడల్లోనూ షెఫాలీ సత్తా చాటింది. బంగ్లాదేశ్‌తో సెమీఫైనల్లో అజేయంగా 100 పరుగులు చేసింది. శ్రీలంకతో ఫైనల్లో 48 పరుగులు సాధించింది. గతేడాది నవంబరులో మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ ఆడినందుకు తొలిసారి ఈ అవార్డు అందుకుంది.

భారత ఆటగాళ్లకు మూడోసారి డబుల్ ధమాకా

ఒకే దేశానికి చెందిన ఆటగాళ్లు పురుషుల, మహిళల విభాగాల్లో ఒకేసారి అవార్డులు గెలవడం ఇది ఐదోసారి. భారత ఆటగాళ్లు ఇలా రెండు పురస్కారాలు అందుకోవడం ఇది మూడోసారి. 2024 జూన్‌లో జస్ప్రీత్ బుమ్రా, స్మృతి మంధాన.. 2025 సెప్టెంబర్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఈ ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన అభిమానుల ఓట్లు, మాజీ అంతర్జాతీయ ఆటగాళ్లు, మీడియా ప్రతినిధులతో కూడిన నిపుణుల కమిటీ నిర్ణయం ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు.





హాట్ కేక్‌ల్లా వరల్డ్ కప్ 2027 టికెట్లు..
12 రోజుల్లో కోటిన్నర దరఖాస్తులు!

- 2027 క్రికెట్ ప్రపంచకప్ టికెట్లకు భారీ డిమాండ్
- 12 రోజుల్లోనే కోటిన్నరకు పైగా దరఖాస్తులు
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్త ఆతిథ్యం
- 24 ఏళ్ల తర్వాత ఆఫ్రికాలో జరగనున్న మెగా టోర్నీ
- చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించేందుకు ఐసీసీ సన్నాహాలు

డీడీ9 వార్త :

2027లో జరగనున్న ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచకప్‌పై అభిమానుల్లో అప్పుడే అంచనాలు ఆకాశాన్నంటాయి. టోర్నీ ఆరంభానికి ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, టికెట్ల కోసం ప్రపంచవ్యాప్తంగా అనూహ్య స్పందన లభిస్తోంది. టికెట్ బ్యాలెట్ ప్రక్రియ ప్రారంభమైన కేవలం 12 రోజుల్లోనే ఏకంగా 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు రావడం క్రికెట్ అభిమానుల్లో నెలకొన్న ఉత్సాహానికి నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు ఈ మెగా టోర్నీకి సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

ఐసీసీ వెల్లడించిన వివరాల ప్రకారం.. 142 దేశాల నుంచి అభిమానులు టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 1,50,83,752 టికెట్ దరఖాస్తులు రాగా, 44,23,417 బ్యాలెట్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైన మొదటి వారంలోనే 10 లక్షల దరఖాస్తులు రాగా, ఆ తర్వాత అనూహ్యంగా ఈ సంఖ్య పెరిగింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ మెగా టోర్నీ ఆఫ్రికా గడ్డపై జరగనుండటం విశేషం. అంతేకాకుండా, నూతన ఫార్మాట్‌లో జరగనున్న ఈ 14వ ఎడిషన్‌ను క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఈవెంట్‌గా నిర్వహించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



ఈ అనూహ్య స్పందనపై ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సంజోగ్ గుప్తా మాట్లాడారు. "ప్రపంచకప్ టోర్నీకి ఉన్న ప్రతిష్ఠ, ఆతిథ్య దేశాలుగా ఆఫ్రికా దేశాలకు ఉన్న ఆకర్షణ, టోర్నీకి ముందు ఐసీసీ చేపట్టిన ప్రచార కార్యక్రమాలే ఈ భారీ స్పందనకు కారణం. ఇది మాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది" అని వివరించారు.

టోర్నీకి ఇంకా ఏడాది సమయం ఉన్నందున, రానున్న రోజుల్లో 360 డిగ్రీల యాక్టివేషన్లు, వివిధ వేదికల ద్వారా ప్రచార కార్యక్రమాలతో అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచుతామని ఆయన తెలిపారు.

అభిమానులు టికెట్ల బ్యాలెట్ కోసం రిజిస్టర్ చేసుకునేందుకు 2026 నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 2027 నవంబర్ 21న జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్ 2027 అక్టోబర్ 2న నమీబియాలోని విండ్‌హోక్‌లో మూడు జట్ల సూపర్ సిరీస్‌తో ప్రారంభం కానుంది.

మొత్తం మీద టోర్నీ ఆరంభానికి ముందే టికెట్ల కు ఈ స్థాయిలో డిమాండ్ రావడం, ఈ మెగా ఈవెంట్‌పై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది.

ఇటీవలే టీమిండియాలోకి ఎంట్రీ.. అప్పుడే కొత్త కారు కొన్న యువ పేసర్!

- ఇటీవలే టీమిండియాలోకి వచ్చిన పేసర్ అకిబ్ నబీ
- కార్ల షోరూమ్‌లో కనిపించడంతో వైరల్ అయిన వీడియో
- కొత్త కారు కొన్నారంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు
- సెప్టెంబర్ 30న వెస్టిండీస్‌పై వన్డేల్లోకి అరంగేట్రం
- గత రంజీ సీజన్ లో 60 వికెట్లతో జమ్మూ కశ్మీర్‌ను గెలిపించిన బౌలర్

డీడీ9 వార్త :

జమ్మూ కశ్మీర్‌కు చెందిన యువ పేసర్ అకిబ్ నబీ ఇటీవలే భారత జట్టులోకి అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అతడు ఓ కార్ల షోరూమ్‌లో కనిపించడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హ్యుందాయ్ మోడల్ కారులో అకిబ్ కూర్చుని ఉన్న వీడియో ఒకటి బయటకు రావడంతో అకిబ్ కొత్త వాహనం కొనుగోలు చేశారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి.





సెప్టెంబర్ 30న గువాహటిలోని బర్సపరా స్టేడియంలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో అకిబ్ నబీ టీమిండియా తరపున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. కేఎల్ రాహుల్ చేతుల మీదుగా ఇండియా క్యాప్ అందుకున్నాడు. పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ తర్వాత భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన మూడో జమ్మూ కశ్మీర్ క్రికెటర్‌గా నిలిచాడు. తన తొలి మ్యాచ్‌లో 8.4 ఓవర్లు బౌలింగ్ చేసి 84 పరుగులు ఇచ్చాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఈ సిరీస్‌ను భారత్ 21 తేడాతో గెలుచుకుంది. అయితే, 202526 రంజీ ట్రోఫీ సీజన్‌లో అకిబ్ అద్భుతంగా రాణించాడు. మొత్తం 60 వికెట్లు పడగొట్టి, జమ్మూ కశ్మీర్ జట్టు తొలిసారి రంజీ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతోనే అతడు జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అంతకుముందు ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్ట్ సిరీస్‌కు ఎంపికైనా, తుది జట్టులో అదే అవకాశం రాలేదు. ప్రస్తుతం రాబోయే రంజీ ట్రోఫీ సన్నాహక శిబిరానికి ఎంపికైన అకిబ్, త్వరలో ఇండియాఏ తరపున కూడా ఆడనున్నాడు.

జైలు నుంచి వచ్చాక శతకం..
మైదానంలోనే ఏడ్చేసిన బెంగాల్ క్రికెటర్!

- రంజీ ట్రోఫీలో సెంచరీ చేసిన బెంగాల్ వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్
- శతకం పూర్తి కాగానే మైదానంలో భావోద్వేగంతో కన్నీళ్లు
- తీవ్రమైన ఆరోపణలతో జైలుకు వెళ్లి ఇటీవలే బెయిల్‌పై విడుదల
- మాటలతో కాకుండా ఆటతోనే సమాధానం చెబుతానని వెల్లడి
- ఢిల్లీతో మ్యాచ్‌లో బెంగాల్‌కు కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

డీడీ9 వార్త :

తీవ్రమైన ఆరోపణలతో జైలుకు వెళ్లి, ఇటీవలే బెయిల్‌పై విడుదలైన బెంగాల్ వికెట్ కీపర్‌బ్యాటర్ అభిషేక్ పోరెల్.. తిరిగి క్రికెట్ మైదానంలోకి అడుగుపెట్టి అద్భుత శతకంతో కదం తొక్కాడు. రంజీ ట్రోఫీలో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నాడు. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలన్న తన పట్టుదలను ఈ సెంచరీతో చాటుకున్నాడు. కల్యాణి వేదికగా జరుగుతున్న ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో బెంగాల్ తరపున ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో సుదీప్ ఘరామి (122 నాటౌట్) కూడా శతకంతో రాణించడంతో వీరిద్దరి భాగస్వామ్యం జట్టుకు భారీ స్కోరు అందించింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీని 240 పరుగులకు ఆలౌట్ చేసిన బెంగాల్, రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసి కీలక ఆధిక్యం సంపాదించింది.

తన కెరీర్‌లో ఇది రెండో ఫస్ట్‌క్లాస్ సెంచరీ. ఈ మైలురాయిని అందుకున్న వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీటిపర్యంతమయ్యాడు. ఆ తర్వాత తేరుకుని, బ్యాట్ పైకెత్తి అభివాదం చేశాడు. ఈ ఘటన మైదానంలో ఉన్నవారిని కదిలించింది. ఆట అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. ఆ భావోద్వేగం తనకు తెలియకుండానే వచ్చేసిందని చెప్పాడు. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నానని, ఈ సంబరం అందులో భాగమేనని వివరించాడు. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లాకు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. గత కొన్ని వారాలుగా పోరెల్ వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. కర్ణాటకకు చెందిన ఓ మెడికల్ విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేసి అత్యాచారం చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపించింది. ఈ ఫిర్యాదు మేరకు ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నెల రోజులకు పైగా జైలులో ఉన్న పోరెల్, సెప్టెంబర్‌లో చిన్సురా కోర్టు నుంచి బెయిల్ పొందాడు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను అతను ఖండించాడు. ఈ నేపథ్యంలోనే అతడిని రంజీ ట్రోఫీ ఆరంభ మ్యాచ్‌కు బెంగాల్ జట్టులోకి ఎంపిక చేశారు. ఈ విషయంపై స్పందించిన బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (సీఏబీ), అతని వ్యక్తిగత, న్యాయపరమైన విషయాలతో తమకు సంబంధం లేదని, ప్రస్తుతం జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని స్పష్టం చేసింది.



ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్.. బీసీసీఐ రెండు కండిషన్లు

- ఆటగాళ్ల ఎంపికలో వయసు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనే ముఖ్యమన్న బీసీసీఐ అధ్యక్షుడు
- తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని స్పష్టీకరణ
- గిల్‌కు సీనియర్ల అనుభవం ఉపయోగపడుతుందన్న మన్హాస్
- బౌలింగ్ బాధ్యతల్లో బుమ్రా కీలకంగా మారగలడని వ్యాఖ్య
- ప్రపంచకప్ విజయానికి బౌలింగ్, ఫీల్డింగ్ కీలకమని కైఫ్ స్పష్టీకరణ

డీడీ9 వార్త :

2027 వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? వయసు మీద పడుతున్న నేపథ్యంలో ఈ ఇద్దరు సీనియర్ల ఎంపికపై కొంతకాలంగా చర్చ సాగుతోంది. అయితే, వయసు ఒక్కటే ఆటగాడి ఎంపికకు ప్రాతిపదిక కాకూడదని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ స్పష్టం చేశారు. ఫిట్‌నెస్, ప్రదర్శనే కీలకమని పేర్కొన్నారు. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా ప్రపంచకప్ జరగనున్న విషయం తెలిసిందే.

ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం

ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా వ్యాఖ్యానించలేదని మన్హాస్ తెలిపారు. తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని చెప్పారు. అయితే, తన అభిప్రాయం ప్రకారం ఆటగాడి ఫిట్‌నెస్, మైదానంలో ప్రదర్శనే ఎంపికకు ప్రామాణికాలని స్పష్టం చేశారు. జట్టు కోసం ఆడుతూ విజయాలు అందించే సత్తా ఉంటే వయసును అడ్డంకిగా చూడకూడదని అభిప్రాయపడ్డారు.

గిల్‌కు సీనియర్ల అండ

వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు కోహ్లీ, రోహిత్, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అన్నారు. జస్ప్రీత్ బుమ్రా వంటి ఆటగాళ్లు బౌలింగ్ విభాగానికి నాయకత్వం వహించగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ బాధ్యతలను సమర్థంగా పంచుకోవడం జట్టుకు మేలు చేస్తుందని చెప్పారు. ఒత్తిడిలో కీలక సందర్భాల్లో సత్తా చాటిన ఆటగాళ్లు జట్టులో ఉండటం మంచి కలయిక అని అభిప్రాయపడ్డారు.



బౌలింగ్, ఫీల్డింగే కీలకం: కైఫ్

మాజీ భారత బ్యాటర్ మహమ్మద్ కైఫ్ సైతం ప్రపంచకప్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికాలో పిచ్‌లు గతంతో పోలిస్తే బ్యాటింగ్‌కు అనుకూలంగా మారాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బౌలింగ్ విభాగం నాణ్యతే విజయాన్ని నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచకప్ గెలవాలంటే బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలను పటిష్ఠం చేసుకోవాలని సూచించారు. కోహ్లీ, రోహిత్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

మా డ్రెస్సులు మాయం చేయడంతో పాటు సైజులు మారుస్తున్నారు..



గత కొద్ది కాలంగా ఏఐ టెక్నాలజీ హీరోయిన్ల పాలిట శాపంగా మారుతోంది. కొంతమంది కేటుగాళ్లు పలు హాట్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎంతో మంది హీరోయిన్లు ఆవేదన వ్యక్తం చేయగా.. తాజాగా, హీరోయిన్ శ్రియా శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో కొందరు ఆకతాయిలు హీరోయిన్ల ఫోటోలను క్రియేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో వదులుతున్న తీరుపై ఆమె స్పందించారు. తాను కూడా ఈ ఏఐ మోర్ఫింగ్ బాధితురాలినేనని చెప్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆన్‌లైన్‌లో తన మార్ఫింగ్ ఫోటోలు చక్కర్లు కొట్టడంపై శ్రియ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ఆ ఫొటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అని తనకు కూడా నమ్మొస్తుందని సరదాగా అన్నారు.


మన శరీర భాగాల సైజులను ఇష్టమొచ్చినట్లు మార్చేయడం, మనం వేసుకున్న డ్రెస్సులను ఏఐ సాయంతో మాయం చేయడం లాంటివి చేస్తుంటారని తెలిపారు. ఇలాంటి పిచ్చి పనులను చూసి మొదట్లో తేలిగ్గా తీసుకున్నప్పటికీ, రోజురోజుకూ ఇది చాలా విసుగు తెప్పిస్తోందని, అసలు ఇది పద్ధతే కాదని ఆమె మండిపడ్డారు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ, దానివల్ల జరిగే నష్టాలు కూడా అంతే ప్రమాదకరంగా ఉంటాయని శ్రియ హెచ్చరించారు. టెక్నాలజీ అనేది ప్రతిసారీ ఒకలా ఉండదని, కాలం మారుతున్న కొద్దీ ఇలాంటి సరికొత్త సమస్యలతో ఎలా జీవించాలో లేదా వాటిని ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శ్రియ చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్న బేబమ్మ..



'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి, ఓవర్ నైట్ లోనే కుర్రకారు గుండెల్లో గూడు కట్టుకున్న క్యూట్ బ్యూటీ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. అయితే వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయింది. ఇక ఇటీవల విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాలో నటించిన ఈ ముద్దుగుమ్మ భారీ డిజాస్టర్‌ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్.

ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఘోడ్గాంకర్ తెరకెక్కించనున్నారట. ఏవీఎస్ స్టూడియోస్ బ్యానర్‌పై అభిషేక్ ఎస్ వ్యాస్ దీనిని నిర్మిస్తుండగా, ఈ ఏడాదే ఈ సినిమా షూటింగ్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. చిత్రంలో కృతి శెట్టిని ఒక సరికొత్త అవతార్‌లో చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు మాత్రం తెలుగు, తమిళంలో కలిసిరాని అదృష్టం.. బాలీవుడ్‌లో అయినా కలిసొచ్చి సరైన హిట్ పడుతుందా? లేక నిరాశనే ఎదురవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించింది

పలు చిత్రాల్లో నటించి ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న యంగ్ బ్యూటీ అనన్య పాండే తాజాగా మరో అరుదైన బాధ్యతను అందుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈ భామ, రాబోయే ప్రతిష్టాత్మక IIFA అవార్డ్స్ 2027 వేడుకకు సహ-హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. నటిగా తనదైన అందం, అభినయంతో అభిమానులకు సంపాదించుకున్న ఆమె, ఇప్పుడు తొలిసారి యాంకర్‌గా అవార్డుల వేదికను హోస్ట్ చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా IIFAతో తనకున్నఅనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అనన్య ఎమోషనల్ కామెంట్స్ చేశారు. ఐఫా వేడుకలో భాగం కావడం తనకెప్పుడూ ఎంతో ప్రత్యేకమని అనన్య అన్నారు. అబుదాబిలోని యాస్ ఐలాండ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక వేదికపైనే తాను మొదటిసారి స్టేజ్ పెర్ఫార్మన్స్ ఇచ్చానని, ఆ క్షణంలో కలిగిన ఉత్సాహం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే ఉందని ఆమె గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఐఫా అవార్డ్స్‌ను టీవీల్లో చూస్తూ పెరిగిన తనకు, భారతీయ సినిమాకు సంబంధించిన ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించిందని తెలిపారు.

కాలక్రమేణా ఐఫా తన సినీ ప్రయాణంలో ఒక అందమైన భాగంగా మారిపోయిందని చెప్పారు. ఇలాంటి ప్రతి వేడుక ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని, కెరీర్‌లో మరింతగా ఎదగడానికి, తనలోని సరికొత్త నైపుణ్యాలను బయటపెట్టుకోవడానికి మంచి అవకాశాలు దక్కాయని అనన్య వెల్లడించారు. ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకునే అవకాశం ఐఫా ద్వారానే కలిగిందని తెలిపారు. ఐఫా వేదికపై ఉండే జోష్, అక్కడి వాతావరణం, ప్రేక్షకుల అరుపులు, అలాగే మన సినిమా ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది ప్రముఖులంతా ఒకేచోట చేరి చేసే సందడిలో నిజంగానే ఒక ప్రత్యేకమైన మ్యాజిక్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఏకంగా ఐఫా అవార్డ్స్‌కు సహ-హోస్ట్‌గా ఒక సరికొత్త బాధ్యతతో ఐఫా 2027 వేదికపైకి వస్తుండటం తనకెంతో సంతోషాన్నిస్తోందని అనన్య అన్నారు. మళ్లీ అదే వేదికపైకి వెళ్లి, మన దేశంలోని గొప్ప నటులు, అద్భుతమైన కథలు, విజయాలను అందరితో కలిసి వేడుకలా సెలబ్రేట్ చేసుకునే అవకాశం రావడం తనలో ఉత్సాహాన్ని నింపుతోందని చెప్పారు.

ఆసక్తికరమైన కబుర్లు రాబోతున్నాయ్!

అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కలయికలో ఓ సినిమా ఖరారైన విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఒక ప్రత్యేకమైన ప్రచార చిత్రంతో ఈ సినిమాని ఇదివరకే అధికారికంగా ప్రకటించాయి సినీ వర్గాలు. అయితే గత కొన్ని రోజులుగా ఈ సినిమా ఆగిపోయిందని, ఆలస్యం అవుతుందనీ... ఇలా రకరకాలుగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. ఈ చర్చలన్నిటికీ ఫుల్‌స్టాప్ పెడుతూ లోకేశ్ కనగరాజ్ సోమవారం ఎక్స్ వేదికగా... అల్లు అర్జున్‌తో చర్చలు జరుపుతున్న ఫొటోతోపాటుగా, త్వరలోనే ఈ సినిమాకి సంబంధించి ఆసక్తికరమైన అప్‌డేట్‌లు రాబోతున్నాయంటూ పోస్ట్‌ని పంచుకున్నారు. దసరా సందర్భంగా కానీ, దీపావళి సందర్భంగా కానీ ఈ చిత్రం ఎప్పుడు మొదలవుతుందో స్పష్టమయ్యే అవకాశాలున్నాయని సమాచారం.





ప్రభాస్ 'ది రాజాసాబ్' ఫ్లాప్.. అలా చేయకుండా ఉండాల్సిందన్న నిర్మాత

సంక్రాంతికి కాకుండా మరే సీజన్‌లో వచ్చినా 'ది రాజాసాబ్' బాగా ఆడేదని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. భారీ అంచనాల మధ్య ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఓటీటీలో విడుదలైన తర్వాత మరిన్ని విమర్శలు ఎదుర్కొంది. ఈ క్రమంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమోషన్స్‌లో 'ది రాజాసాబ్' ఫలితంపై టీజీ విశ్వ ప్రసాద్ స్పందించారు.

''ది రాజాసాబ్'ను సరైన సీజన్‌లో విడుదల చేయలేదేమో. ఒకవేళ సంక్రాంతికి కాకుండా ఎప్పుడు వచ్చినా బాగా ఆడేది. సినిమాకున్న భారీదనాన్ని దృష్టిలో పెట్టుకుని మా వరకూ బాగానే విడుదల చేశాం. టికెట్ రేట్లు పెంచేందుకు ప్రయత్నించాం. దీంతో సినిమా ప్రీమియర్ ఆలస్యమైంది. అలా చేయకుండా ఉండ్సాలింది. చాలా మంది అసహనానికి గురయ్యారు. ఇంకా చాలా కారణాలు ఉన్నాయి. మా సంస్థ నుంచి చాలా సినిమాలకు సీక్వెల్స్ వస్తాయి. అయితే, ఏది చేసినా చాలా జాగ్రత్తగా చేయాలని నిర్ణయించుకున్నాం''

''ప్రతి సినిమా ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకుని చేస్తాం. వాటిల్లో 'గరివిడి లక్ష్మి'లాంటి వైవిధ్య చిత్రం ఉంటుంది. అలాగే 'మిరాయ్', 'జాంబీరెడ్డి' వంటి కొనసాగింపు చిత్రాలూ ఉంటాయి. 'స్పిరిట్' మూవీ విషయంలో నా పాత్ర చాలా తక్కువ. నేను కేవలం డిస్ట్రిబ్యూటర్‌గా మాత్రమే వ్యవహరిస్తున్నా. 2028లో ప్రభాస్‌తో ఓ మూవీ ఉంటుంది. అది కూడా భారీ స్థాయిలో తీస్తాం. కొన్ని సినిమాల విషయంలో తప్పులు జరిగాయి. ప్రస్తుతం పది సినిమాల వరకూ మా ప్రొడక్షన్ హౌస్‌లో షూటింగ్ జరుపుకొంటున్నాయి. భవిష్యత్‌లో తప్పులు జరగకుండా చూసుకుంటాం'' అని టీజీ విశ్వప్రసాద్ అన్నారు. దసరా సందర్భంగా 'జైలర్ 2', 'రణబాలి' వంటి భారీ చిత్రాలు విడుదలవుతున్నా, తామొక మంచి సినిమాతో వస్తున్నామని, 'గరివిడి లక్ష్మి' ఎక్కువ రోజులు థియేటర్‌లో ఆడుతుందని ధీమా వ్యక్తం చేశారు.





రక్త దాహం పెరుగుతోంది..
హైందవ టీజర్ రాబోతున్నది

హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ పాన్ ఇండియా మూవీ 'హైందవ'. దర్శకుడు లుధీర్ బైరెడ్డి తెరకెక్కిస్తున్న ఈ మూవీ నుంచి తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌కు ముహూర్తం ఫిక్స్ చేస్తూ.. 'కోపానికి ఒక కొత్త రూపం వచ్చింది. రక్త దాహం పెరుగుతోంది.. శక్తివంతమైన హైందవ టీజర్ అక్టోబర్ 14న రానుంది' అంటూ ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను షేర్ చేశారు. కాగా.. 400 ఏళ్లనాటి ఆలయం నేపథ్యంలో సాగే ఈ పౌరాణిక యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌కు లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ మూవీకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.



మనసుకు హత్తుకునే ప్రేమకథ.. నేచురల్ స్టార్‌తో జోడీ కట్టనున్న రుక్మిణి వసంత్!



టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయారు కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్. ఇండస్ట్రీకి వచ్చిన తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో వరుస బ్లాక్ బస్టర్లు అందుకుంటూ దూసుకెళ్తున్న ఈ అమ్మడుకి ఇప్పుడు తెలుగులో మరో బంపర్ ఆఫర్ వచ్చినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు చర్చనీయాంశంగా మారాయి. '96', 'మెయ్యళగన్' వంటి అద్భుతమైన భావోద్వేగ చిత్రాలను తెరకెక్కించిన ప్రముఖ దర్శకుడు ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని హీరోగా ఒక కొత్త సినిమా తెరకెక్కబోతుండగా.. ఇందులో రుక్మిణి హీరోయిన్‌గా ఎంపిక అయినట్లు టాక్.

ఇది పూర్తిగా మనసుకు హత్తుకునే సున్నితమైన లవ్ స్టోరీ అని సమాచారం. ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర చాలా బలంగా, ఎంతో ప్రాధాన్యతతో ఉండబోతుందట. ఆ పవర్‌ఫుల్ పాత్ర కోసం మేకర్స్ రుక్మిణి వసంత్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' ప్రాజెక్ట్‌లో నటిస్తున్న ఈ భామ ఖాతాలో.. ఇప్పుడు నాని సినిమా కూడా చేరడం విశేషం. ఏకంగా టాలీవుడ్ స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్న రుక్మిణి వసంత్ క్రేజ్ చూస్తుంటే తెలుగులో ఆమె హవా త్వరలోనే మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.